ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 16

## జన్మజన్మల అనుబంధం



39 **పరమాత్మ స్వరూపుడైన మానవుడు అజ్ఞానం వలన రాగద్వేషములు ఇష్టాయిష్టములకులోనై సుకృత, దుష్కృత్యాలు చేస్తాడు. వాటి కర్మ ఫలితాలను అనుభవించడానికెన్నో జన్మ పరంపరలు ఎత్తుతాడు.** 'మనుష్యాణాం సహస్రేషు' అన్నట్లు ఎవరో ఒకరు మహాత్ముల కృపవలన అజ్ఞానాన్ని ఛేదించుకొని జ్ఞానులౌతారు. అట్టివారికి జీవుల యొక్క పూర్వజన్మలు, వాటి కర్మఫలాలు స్పష్టంగా తెలుస్తాయి. ఈ విషయం అందరు మహనీయుల చరిత్రలలోనూ చూడవచ్చు. శ్రీస్వామివారు కూడా అనేక మందికి పూర్వ జన్మలు, వారితో తనకు గల అనుబంధం గూర్చి చీటీలు వ్రాయించి ఇచ్చేవారు. వారితో తనకు గల పూర్వ జన్మల అనుబంధం గూర్చి తెలిసిన మానవులు వారి ఎడల కృతజ్ఞతా భావంతో ఎంతో సన్నిహితమై శ్రీస్వామివారిని సేవించేవారు.

ఒకరోజు గురవయ్యను గురించి ఇలా చెప్పారు.

'ఈయన బెంగుళూరు దక్షిణం వీధిలో కంసాలింట పుట్టాడు. మరలా కోమటింటపుట్టాడు. ఆ తరువాత నేను వెంకటగిరి రాజాగారింట్లోనూ, గురవయ్య రాజాగారి మామగారింట్లోనూ పుట్టాము'.

ఒకసారి చలమానాయుడుతో చెప్పారు. 'చలమానాయుడా! పోయిన జన్మలో వెంకటగిరి రాజాగారింటిలో నేను గవర్నరు కోర్సు, నీవు జడ్జి కోర్సూ చదివాము. నగళ్ళలో నివసించాము. మనిద్దరికీ పెండ్లి లేదు. ఇప్పుడు పూరింట్లో వున్నాము. ఎల్లప్పుడూ మేడలు వస్తాయా? ఆ తరువాత పిఠాపురం రాజాగారింట్లో వుండి ఇప్పుడు నాగలేటూరు వచ్చాను' అన్నారు.

మల్లిక వెంకయ్య (అనికేపల్లి) ఇరవై అయిదు సం॥ల వయస్సులో శ్రీస్వామివారి దగ్గరకొచ్చారు. గత ఇరవైరెండు సం॥లుగా కట్టెలు కొట్టి శ్రీస్వామివారి అగ్నిగుండానికి సమర్పిస్తున్నాడు.

ఒకరోజు శ్రీస్వామివారు వెంకయ్యను చూచి 'నా దగ్గరకు వచ్చేయ్' అని పిలిచారు. 'స్వామీ! నేను రాను. మీ దగ్గరకొస్తే భిక్షాన్నం తెచ్చేందుకు పోవాలి. అది నావల్లగాదు' అన్నాడు. 'అబ్బే అదేమీలేదు..... రామేశ్వరంలో నేను మేనేజరు. నీవు పెద్ద గుమాస్తాగాను వుండినాము. ఈ ప్రాంతంలో నీ బాకీలన్నీ తీరిపోయాయి. నా దగ్గర కొచ్చేయ్' అన్నారు. **'స్వామీ, నాకు** 40
**దయ్యాలు పోగొట్టే మంత్రం, గాలికుంటు మంత్రం, కాటేరు మంత్రం, పోలేరమ్మ మంత్రం చెపితే నీ దగ్గరకొస్తాను'** అన్నాడతడు. 'అట్లాగే చెపుతాను' రమ్మన్నారు. 'నీవు మా మఠాలో మేస్త్రీగా వుండి కట్టెలు కొడుతుండు. నీ వెనకాలే వీళ్ళందరూ వస్తుంటారు' అని చీటీ వ్రాయించారు శ్రీస్వామివారు. అతడు కోరినట్లే ఆయా మంత్రాలు చెప్పడమేగాక వాటిని పలికే విధానము, నియమనిష్ఠలు వగైరా కూడా చెప్పారట. (అహంకారం ఎంత దిగజారుస్తుందో చూడండి. మానవుల ఏ బాధైన నేను పొమ్మంటే పోయే వరమిస్తే వస్తానని అడిగితే నియమ నిష్టలు, మంత్రజపం బాధ పోయేదేగదా! వస్తువులు మొలలో కట్టుకో! పొమ్మన్న జబ్బులు పోతాయన్నారు గదా వేలూరు రామానాయుడ్ని.)

స్వామివారి సేవకురాలు కోడూరు వెంకమ్మ గురించి ఇలా చెప్పారు. "పూర్వం జెండాలవారి కోడలవై పుట్టి, అంతస్తులలో నుండి వంటి నిండా బంగారు నగలు ధరించి క్రింది చూపు లేకుండా పై చూపుతో వున్నావు. ఒక రోజు నీ కాలు జెండాకు తగిలి జెండా వరిగింది. నీవు బోర్లా పడ్డావు. 'నీవు భూమి మీద పుట్టి సామాన్య విధవరాలుగా వుంటావు పో!' అని ఆ జెండా శపించింది. ఆ శాపం లేకుంటే నీకు పెండ్లేలేదు. కానీ శాపం వలన పెండ్లి జరిగి బాల్యంలోనే భర్త పోయాడు. కానీ మేము నిన్ను వదలి పెట్టము" అన్నారు.

ఇనుకుర్తిలో ఒక టీచర్ వుండేవాడు. అతని కుమారునికి బుద్ధిహీనత, కాళ్ళు చేతులు స్వాధీనంలో లేవు. డాక్టర్లవల్లగాక శ్రీస్వామివారి చెంతకు తీసుకువచ్చారు. శ్రీస్వామివారు అన్నారు. 'ఏమి చేస్తామయ్యా? గుఱ్ఱాలను కొట్టినపాపం, పూర్వజన్మలో పందెపు గుఱ్ఱాలు తోలేవాడు. అనుభవించాలి గదా?'

ఇలానే శ్రీస్వామివారి దగ్గరకు ఒక మూర్ఛవ్యాధిగల సన్యాసి వచ్చాడు. 'ఏమిస్వామీ! ఇంత పవిత్ర జీవనం చేసేవాడికీ వ్యాధి?' అని భక్తులు అడిగారు. **పూర్వం ఇతడు పక్షుల వేటగాడు. సంబరానికి వేటాడేవాడు. అనుభవించవద్దా?'** అన్నారు శ్రీస్వామివారు. ఆకలిచే బాధించబడి మాంసం తినడం కాదు. సంబరానికి 40

వేట ఆడితే ఇలా వుంటుంది. అన్ని విషయాలు అంతే.

ఆ సన్యాసి మూర్ఛ వచ్చి పై నుండి గిరగిర తిరిగి క్రింద పడే పక్షివలె గిరగిర తిరిగి పడేవాడు. కర్మసూత్రం ఎంత చక్కగా పనిచేస్తుందో శ్రీస్వామివారు వివరించారు.

నాగులవెల్లటూరులో ఒకపిల్లవానికి రెండు బొటనవేళ్ళకూ స్పర్శలేదు. శ్రీస్వామివారి దగ్గరకు తీసుకువచ్చారు. 'కాట్‌పుల్లుతో తమాషాకు పిట్టల్ని కొట్టేవాడు. అనుభవించవద్దా?' అన్నారు శ్రీస్వామివారు.

ఒకరోజు శ్రీస్వామివారు రోశిరెడ్డిని పిలచి, 'అయ్యా! పోయిన జన్మలో నీవు సుబ్బయ్య అనే బ్రాహ్మణుడవు. నీవు నాకు చదువు చెప్పిన గురుడవు. ఈ పంచెల జత, రూ.10/- లు గురుదక్షిణగా తీసుకో' అని ఆయనకు ఇచ్చారు.

1979వ సం॥లో శ్రీస్వామివారు ఇనుకుర్తిలో వుండేటప్పుడు ఒక యానాది స్త్రీ, ఆమె ముగ్గురు కుమార్తెలు బాగా ఆకలితో వచ్చారు. వారికి శ్రీస్వామివారు అన్నం పెట్టించారు. విస్తర్లోని అన్నాన్ని తల్లికంటే ముందు ఆ బిడ్డలు తినేశారు. మరలా అన్నం వడ్డించి అందరికీ తృప్తి గల్గించారు. 'వీళ్లేకాదయ్యా! ఈమెకు ఇంటి దగ్గర ఇంకా నలుగురు బిడ్డలున్నారు. పూర్వం ఈమె రాజుగారి పట్టమహిషి. ఊయలలో వూగుతూ తన ఏడుగురు దాసీలకు పెట్టకుండా ఈమె హాయిగా ఫలహారం భోంచేసేది. ఆ ఏడుగురు దాసీలు ఇప్పుడామె బిడ్డలుగా పుట్టి ఈమెను తిననివ్వకుండా బాధిస్తున్నారు' అన్నారు శ్రీస్వామివారు. ఆమె తృప్తిగా భోంచేశాక ఆమెకు పది రూపాయలు, ఒక చీర ఇప్పించి పంపారు. కర్మఫలం ఎలా అనుభవమవుతుందో మనము గుర్తించి నడచుకోవాలి.

1969 సం॥ ప్రాంతంలో గొలగమూడి ఆశ్రమానికి ప్రతినిత్యం ఒక గిరిజన బాలిక భిక్షాన్నానికి వచ్చేది. తులశమ్మగారు ఆ బాలికకు భిక్షాన్నాన్ని పెట్టి పంపేది. ఒకరోజు ఆ బాలిక రాగానే వరండాలో వేలిముద్రలు వేస్తున్న శ్రీస్వామివారు 'ఆమె వచ్చిందమ్మా!' అంటూ లోపలనున్న తులశమ్మను పిలిచారు. అమ్మ పెట్టిన అన్నం తీసుకొని ఆ బాలిక వెళ్లిపోయింది. శ్రీస్వామివారు, 'రాజాగారి కుటుంబములో నుండి బ్రాహ్మణ కుటుంబములోకి

అక్కడ నుండి ప్రస్తుతం యానాది కుటుంబములోకి వచ్చింది. ఏం సృష్టయ్యా ఇది'! అంటూ పక పక నవ్వారు. దాతృత్వం తగ్గేకొద్దీ మానవుడు మేడలో నుండి పెంకుటింట్లోకి, అక్కడ నుండి గుడిశలోకి రావలసుంటుందని శ్రీస్వామివారి భావం.

వేలూరు సుబ్రహ్మణ్యంగారు చాలా కాలంగా తన భార్య మోకాలు నొప్పితో బాధపడుతుంటే శ్రీస్వామివారికి విన్నవించారు. 'అయ్యా! ఈమె పూర్వజన్మలో కడివేడు గ్రామంలో మగవాడుగా వుండి తన ఇంట్లో వడ్లు తింటున్న ఆవును రోకలి బండతో కొట్టింది. ఆ ఖర్మ ఇది. గ్రామదేవత బంగారమ్మ, వీరరాఘువ స్వామి తగ్గిస్తారు. కానీ పూర్తిగా నొప్పిపోదు' అని సెలవిచ్చారు. అట్లాగే జరిగింది అంటారు.

